


చంద్రబాబును కలిసిన అదితి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదితి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు, తల్లి సునీల ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.

-ప్రజాశక్తి, విజయనగరం కోట





నారుమడి సిద్ధం చేస్తున్న రైతు

రుతుపవనాల తాకిడితో అన్నదాతలో కలివిడి కనిపిస్తోంది. ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమౌతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నేల కాస్త చల్లబడింది. దీంతో ప్రస్తుతం అక్కడక్కడా వేరుశనగ విత్తనాలు నాటుతున్నారు. మరోవైపు వరి నారుపోతకు అనుగుణంగా దుక్కులు వేసి మడులను తయారు చేస్తున్నారు. మరొకటి లేదా రెండు జల్లులు కురిస్తే నారుమడులు సిద్ధం చేసుకోవడానికి అన్ని ప్రాంతాల్లోనూ అనువుగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. సకాలంలోనే జల్లులు కురుస్తున్నప్పటికీ ఇంకా సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం రైతులను కొంచె ఇబ్బంది పరుస్తోంది.

సాగుకు సన్నద్ధం

- జోరుగా వేరుశనగ విత్తు
- వరినారు మళ్లు సిద్ధానికి దుక్కులు
- సిద్ధంగా 27,235 క్వింటాళ్ల విత్తనాలు
- రుతుపవనాల తాకిడితో అన్నదాతలో మొలకెత్తిన ఆశలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం పూర్తిగా వ్యవసాయాధారిత జిల్లా. పెద్దగా సాగునీటి వనరులు లేకపోవడంతో పూర్తిగా వర్షాధారంగానే ఖరీఫ్ పంటలు సాగవుతాయి. ఈ పంటలతోనే ఏడాదంతా బతుకీడ్చాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో ఖరీఫ్ సీజన్ కోసం రైతాంగం ఏడాదంతా ఎదురు చూస్తుంటుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలుపుకుని 499,455 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, ఇందులో అత్యధికంగా వరి 2,31,850 ఎకరాల్లో సాగవుతుందని అధికారులు అంచనాలు రూపొందించారు. మొత్తంగా ఇప్పటివరకు 1105 (0.4 శాతం) మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ, చెరకు తదితర పంటల సాగైనది. గత ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 3,13,465 ఎకరాలు కాగా, 2,84,915 (91 శాతం) విస్తీర్ణంలో వివిధ పంటలు సాగయ్యాయి.

జిల్లాకు 50,267 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించగా, ఇప్పటి వరకు 27,235 క్వింటాళ్లు రైతు భరోసా కేంద్రాలకు చేరినట్టు అధికారులు చెబుతున్నారు. మొత్తం విత్తన కేటాయింపులో అత్యధికంగా వరి 46,530 క్వింటాళ్లు, పచ్చిరొట్ట విత్తనాలు 2,517 క్వింటాళ్లు, ఇతర పంటల విత్తనాలు 1220 క్వింటాళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాకు చేరిన విత్తనాలన్నీ ఆర్‌బికెల్లో సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. గత ఖరీఫ్ సీజన్లో 43,519 క్వింటాళ్లు విత్తనాన్ని సరఫరా చేశారు. ప్రస్తుత సీజన్ అంతటికీ కలిపి 51,476 మెట్రిక్ టన్నుల ఎరువులు లక్ష్యానికి గాను ఇప్పటివరకు 7,259 మెట్రిక్ టన్నుల యూరియా, 782 మెట్రిక్ టన్నుల డిఎపి, 160 మెట్రిక్ టన్నుల ఎంఒపి, 501 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 131 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పి... మొత్తంగా 8,834 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేశారు. గతేడాది సీజన్ మొత్తానికి 93,032 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేశారు. జిల్లాలో 27 మండలాల్లో 54 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. వీటి పరిధిలోని 242 గ్రామాలకు చెందిన 44,789 మంది రైతుల ద్వారా 42,355 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు.

లోటు వర్షపాతం

జిల్లా సాధారణ వర్షపాతం 1112 మిల్లీ మీటర్లు కాగా, గత ఏడాది (2023-24) 999 మి.మీ (-10.2 శాతం తేడాతో)గా నమోదైంది. ప్రస్తుత ఖరీఫ్ సీజను (జూన్ మొదటి వారం వరకు 124 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 74.4 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది.

సరిపడా విత్తనాలు
అందుబాటులో ఉంచాలి

కలెక్టర్‌కి ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఖరీఫ్ సీజన్ ఆరంభమైందని, రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉపాధ్యక్షులు ఎల్.ఆదినారాయణ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, కౌలుదారులకు వరి, తదితర పంటలకు రాయితీపై నాణ్యమైన విత్తనాలు ఆర్‌బికెల్లో ఉంచాలన్నారు. ఎరువులు, పురుగుమందులు ఆర్‌బికెల్లో అందుబాటు లో ఉంచాలని కోరారు. విత్తన, ఎరువులు, పురుగు మందుల్లో కల్తీలు, నాసిరకం అరికట్టడానికి పర్యవేక్షణ చేయాలని తెలిపారు. 1121 రకం వరి విత్తనం చీడపీడలకు, కోత సమయంలో వర్షాలకు తడిసి వేగంగా మొలకరావడం, ఇతర కారణాల వల్ల దెబ్బతినడం, దిగుబడులు తగ్గటంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. జిల్లా వాతావరణ, భూసార పరిస్థితులకు అనువైన, అధిక దిగుబడినిచ్చే, చీడ పీడలను తట్టుకొనే విత్తనాలను రైతులకు అందించాలని కోరారు. వెంటనే కాలువల్లో పూడికలు తీయించాలన్నారు. ఇటీవల ఈదురు గాలులకు అరటి, వివిధ పంటలకు నష్టం వాటిల్లిందని, వాటికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిడుగుపాటుకు మృతి చెందిన పశువులు, గొర్రెలు, మేకలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు.



కలెక్టర్‌కు వినతి అందించిన రైతుసంఘం నాయకులు

15 నుంచి రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఏలూరులో రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు నాయకులు బి.శంకర్రావు, రెడ్డి నారాయణరావు తెలిపారు. సోమవారం నగరంలోని పాత మున్సిపల్ షాపుల వద్దనున్న ఆటో స్టాండ్ వద్ద వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15న ఏలూరులో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్.అప్పలరాజు రెడ్డి, జిల్లా రజక సమాఖ్య నాయకులు జి.సత్యారావు, నవ యువ సమాఖ్య నాయకులు ఎం.అప్పలరాజు, మున్సిపల్ షాపుల సంఘం కార్యదర్శి డి.సన్యాసిరావు పాల్గొన్నారు.



కొంపముంచిన గ్రూపులు

- 22 పంచాయతీల్లో 20 చోట్ల వెనుకబడ్డ వైసిపి
- విజయనగరం మండలంలో టిడిపికి పూర్వ వైభవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం మండలంలో 22 పంచాయతీలు ఉన్నాయి. అందులో 17 మంది సర్పంచులు వైసిపికి అండగా ఉన్నారు. ఐదుగురు సర్పంచులు మాత్రమే టిడిపికి ఉన్నారు. 12 ఎంపిటిసి స్థానాలకు 8 వైసిపికి, నాలుగు టిడిపికి ఉన్నాయి. ఎంపిపి పదవి కూడా వైసిపి చేతిలో ఉంది. జెడ్‌పిటిసి కూడా వైసిపి అభ్యర్థి ఉన్నారు. ఇలా పూర్తి స్థాయి మెజారిటీ ఉన్నా మే 13 జరిగిన ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి మండల ఓటర్ల మనస్సు గెలుచుకోలేకపోయారు. ఈ ఎన్నికల్లో మండలంలో 20 పంచాయతీల్లో టిడిపికి మెజారిటీ రాగా, రెండు పంచాయతీల్లో మాత్రమే వైసిపి ప్రభావం చూపించింది. వైసిపి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు మండల ఓటర్లతో ఓట్లు రాబట్టుకోవడంలో విఫలమయ్యారు.

> విజయనగరం నగర ఓటర్లతోపాటు మండలంలో గ్రామీణ ఓటర్లు కూడా వైసిపిని ఓడించడంలో ముఖ్య భూమిక పోషించారు. మండలంలోని గ్రామీణ ఓటర్లు మొన్న జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసిపికి కోలుకోలేని దెబ్బ కొట్టారు. ఒకప్పుడు టిడిపికి కంచుకోటగా ఉన్న మండలంలో ఉన్న 22 పంచాయతీల్లో మళ్లీ ఆ పార్టీకి పూర్వ వైభవం వచ్చేలా ఓటర్లు తీర్పునిచ్చారు. 22 పంచాయతీలకు గాను 20 చోట్ల టిడిపికి అత్యధికంగా ఓట్లు వచ్చాయంటే ప్రజలు ఏ విధంగా తీర్పు ఇచ్చారో అర్థమవుతోంది.

అన్ని గ్రామాల్లోనూ గ్రూపులే

విజయనగరం మండలంలో అన్ని గ్రామాల్లోనూ వైసిపిలో గ్రూపులు ఉన్నాయి. అవే వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి ఓటమికి కారణంగా తెలుస్తోంది. వైసిపి పూర్తిస్థాయి మెజార్టీ సాధించిన తర్వాత పంచాయతీల్లో సర్పంచికి పోటీ నాయకులను తయారు చేయడం, గ్రామంలో ముగ్గురు, నలుగురు నాయకులు గ్రూపులుగా విడిపోయి వారి మధ్య ఐక్యత లేకపోవడం వంటి కారణాలు వైసిపిని దెబ్బతీశాయని చెప్పొచ్చు. ఎమ్మెల్యే తీరుపైన, మండలంలో కోలగట్లకు ప్రధాన అనుచరుడిగా ఉన్న మండల నాయకుడి వ్యవహార శైలి కారణంగా మండలంలో వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, కింది స్థాయి నాయకులు అసంతృప్తితో ఉండటం వల్ల వైసిపి ప్రజల్లో పట్టుకోల్పోయినట్లు తెలుస్తోంది. దుప్పాడలో నాలుగు గ్రూపులు, గుండాలపేట సర్పంచ్ పూర్తిగా పార్టీ మారడం, రాకోడు సర్పంచ్ అసంతృప్తిగా ఉండటం, ఎంపిపికి, పార్టీ మండల నాయకుడికి మధ్య అభిప్రాయ భేదాలు రావడం వంటి పరిణామాలు కోలగట్ల ఓటమికి కారణంగా మారాయి. అసంతృప్తులను బుజ్జగించడం, గ్రూపులను ఐక్యం చేయడంపై నాయకులు దృష్టిసారించ లేదు. నాయకులు ఆ పని చేయకపోగా వాటిని పెంచి పోషించడం వల్ల కోలగట్ల ఓటమికి ప్రధాన కారణంగా నిలిచాయి.

ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా సోమవారం నందమూరి అభిమాన సంఘం ఆధ్వర్యాన ప్రేమ సమాజంలో కేక్ కట్‌చేశారు. అనంతరం పండ్లు, రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కాగిత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బంటుపల్లి రమేష్, కార్యదర్శి కనకల మన్మథరావు, కోశాధికారి కె.రమణ, తదితరులు పాల్గొన్నారు.



కామాక్షినగర్‌లో చెరువు కబ్జా చేసి వేసిన డబ్రీస్

ఆక్రమణలో చెరువులు

నగరంలో తగ్గిపోతున్న భూగర్భ జలాలు ● అధికారులు స్పందించకుంటే చెరువులు మాయం

పర్యావరణం, భూగర్భ జలాల పరిరక్షణతోపాటు ప్రజల దాహార్తి తీర్చేలా దూరదృష్టితో ఏర్పాటు చేసిన మంచినీటి చెరువులు ఆక్రమణలతో కుంచించుకు పోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడి రూ.కోట్ల విలువ చేసే నగర పాలక సంస్థ చెరువుల భూములు నేడు పెద్ద వ్యాపారంగా మారాయి. ఏడాదికేడాదికి కనుమరుగవుతున్నాయి. దీంతో నగరంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే నగరంలోని చెరువులన్నీ కొన్నేళ్లలో మాయమయ్యే ప్రమాదం పొంచి ఉంది

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో, చుట్టుపక్కలా చిన్నా పెద్దా కలిపి సుమారుగా 80 వరకు చెరువులు ఉన్నాయి. వాటిని రక్షించడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారంలో ఉన్న వారే చెరువులు కబ్జా చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి సొమ్ముచేసుకుంటుంటే, అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారు. అంతే తప్ప వాటిని కాపాడే ప్రయత్నం చేయడం లేదు. నగరంలో పెద్ద చెరువు ఏడాదికి ఏడాది ఆక్రమణలు పెరిగి కుచించుకు పోతుంది. వందల ఎకరాల్లో ఉన్న పెద్ద చెరువు రోజురోజుకు తగ్గిపోతోంది. నగరానికి నీటి పథకం ద్వారా తాగునీటిని అందించేందుకు ఇదే చెరువు వద్ద నీటి శుద్ధి కర్మాగారం పనులు కూడా జరుగుతున్నాయి. నగరం నడిఒడ్డున మంచి ఆహ్లాదాన్ని అందించే చెరువు నేడు కబ్జాకు గురి అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పడమర వైపు గట్లు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇక్కడ కొత్తగా కొన్ని నిర్మాణాలు కూడా వెలిశాయి. చెరువు గట్టుపై ఇళ్లు ఉన్నవారికి ప్రభుత్వ స్థలం ఇచ్చిందో, లేదో సర్వే చేయాలని, లేనిపక్షంలో వారికి ఇళ్లు మంజూరు చేసి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నా పట్టించుకునే వారు లేరు. చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడంతోపాటు చుట్టూ నడక దారి ఏర్పాటు చేస్తే మున్సిపాలిటీకి ఆదాయంతోపాటు ప్రజల ఆరోగ్యం కూడా బాగు పడుతుందని చేపట్టిన పనులు కూడా నేటికీ పూర్తి కాలేదు.

వ్యాపార కేంద్రాలుగా చెరువులు

నగరంలో ఉన్న చెరువులు చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని వ్యాపారానికి అనువుగా మారి పోయాయి. నగరానికి ఆనుకొని ఉన్న ధర్మపురి, కెఎల్‌పురం, కణపాక, కామాక్షినగర్, అయ్యన్నపేట, జమ్ము నారాయణపురం, అయ్యప్పనగర్, బాబా మెట్ట ప్రాంతం, గాజులరేగ వంటి ప్రాంతాల్లో నేడు చెరువులు కనిపించడం లేదు. ఆ ప్రాంతాల్లో ఉన్న చెరువుల చుట్టూ నిర్మాణాలు జరిగి వాటి పరిమాణం రోజురోజుకు తగ్గిపోతోంది. చెరువును కబ్జా చేసి నిర్మాణాలు చేయకూడదని తెలిసినా అడ్డగోలుగా నిర్మాణాలు సాగుతున్నాయి. ఇలా నగరంలో, చుట్టూ ఉన్న చెరువులు కబ్జాకు గురై వ్యాపార స్థలాలుగా మారిపోయాయి.

ఇప్పటికైనా స్పందించేనా?

చెరువులు కబ్జాపై అధికారులు స్పందించి వాటిని రక్షించకకోతే చెరువులు ఉండేవట.. అని చెప్పుకునే పరిస్థితి దాపురించే ఆవకాశం ఉంటుంది. ఇప్పటికే చాలా చెరువు గట్టు ప్రాంతాలు, చెరువులు కబ్జాకు గురయ్యాయి. చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేయకూడదని నీతులు చెప్పే పాలకులకు, అధికార్లకు చెరువుల కబ్జాలు కనిపించడం లేదా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. వెంటనే కొత్తగా అధికారంలోకి వచ్చిన పాలకులు, అధికారులు చిత్త శుద్ధితో చెరువులను కబ్జాల నుంచి కాపాడకపోతే భవిష్యత్తు తరాలకు నీటి సమస్యతోపాటు కలుషిత వాతావరణం అందించే వాళ్లవుతారు.

> ఏటా నగరంలో వేసవి ప్రారంభం కాక ముందే తాగునీటి సమస్య అధికంగా ఉంటోంది. చెరువులన్నీ ఆక్రమణలకు గురి కావడం వల్ల త్వరలో తాగునీటి విలయాన్ని మనం చూసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- నగరంలోని దాసన్నపేట ఎర్ర చెరువు, కాటవీధి నల్లచెరువు, బాబామెట్ట కొండగెడ్డ, అయ్యకోనేరు, బుచ్చన్న కోనేరు ఆక్రమణలతో కుచించుకు పోతున్నాయి.
- గెడ్డవీధి, రాజీవ్‌నగర్ మీదుగా ధర్మపురి వరకు వెళ్లే గెడ్డ.. పిల్ల కాలువగా మారింది.
- ధర్మపురి చెరువు, ప్రదీప్‌నగర్ చెరువులు కనుమరుగయ్యే పరిస్థితికి వచ్చాయి.
- ప్రేమసమాజం ఎదురుగా ఉన్న చెరువు పూర్తిగా మూత పడింది.
- ఊటగెడ్డ వాగు కబ్జాలు చేసి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో ఊరిగా మారిపోయింది.
- సారిపల్లి రోడ్డులో క్వారీకొండ వాగులు కబ్జా కోరల్లో చిక్కిశల్యమైపోయాయి.



కబ్జాకు గురైన పెద్ద చెరువు

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో
సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్నంలో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. 83 కిలోల విభాగంలో ఎస్.రామకృష్ణ బంగారు పతాకం సాధించాడు. జిల్లా పరిషత్తు కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా రామకృష్ణ పనిచేస్తున్నాడు. ఎస్.రాజా 64 కేటగిరీలో 2 బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించాడు. కె.జగదీష్ 59 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించాడు.



సాధించిన పతకంతో రామకృష్ణ

సొంత వైద్యం.. కొత్త రోగాలకు ఆస్కారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

సొంత వైద్యం కొత్త రోగాలకు ఆస్కారం ఇస్తుందని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.పద్మలీల అన్నారు. సోమవారం జిల్లా కేంద్రాస్పత్రి వద్ద సొంత వైద్యం.. అనర్థాయికం, హానికరం అనే కార్యక్రమాన్ని హెచ్‌ఒడి డాక్టర్ అన్నపూర్ణ, సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆస్పత్రి నుంచి మెయిన్ గేటు వరకు ర్యాలీగా వెళ్లి, ప్రజలకు, రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమన్నారు. ఇటీవల కాలంలో యూట్యూబ్, వాట్సాప్ తదితర మాధ్యమాలను చూసి, ప్రజలు కొన్ని రోగాలకు సొంత వైద్యం చేసుకుంటున్నారని, ఆ విధానం ప్రాణాలకే ప్రమాదమని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంజెక్షన్, మాత్ర ఏదైనా వైద్యుల సలహా మేరకే తీసుకోవాలని సూచించారు. ఆర్ఎంపిలు వైద్యులు కాదని, ప్రథమ చికిత్స వైద్య సలహాదారులు మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ ఎం.సురేష్, హెచ్‌ఒడిలు డివిఎల్, రమణీ, అజయ్, డాక్టర్ సురేష్, అమ్మన్నమ్మ, ఆమోజీరావు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి
www.prajasakti.com

మాధవికి మంత్రి పదవి?

- జనసేన కోటాలో అవకాశం
- 21 మందిలో ఆమె ఒక్కరే

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించిన తరువాత మంత్రి పదవులు ఎవరికి దక్కుతాయనే దానిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 9 నియోజకవర్గాల్లో అన్ని చోట్లా కూటమి అభ్యర్థులే విజయం సాధించారు. వీరిలో ఎక్కువ మంది మహిళా ఎమ్మెల్యేలే ఉన్నారు. గెలిచిన వారిలో సీనియర్లతోపాటు మొదటిసారి విజయం సాధించిన జూనియర్లు కూడా ఉన్నారు. దీంతో సీనియర్లు కాబట్టి తమకే మంత్రి పదవి వస్తుందని కొంత మంది చెప్పగా లేదు కూటమి కొత్తదనానికి అవకాశం ఇస్తుందని మరికొంత మంది ఆశావహులు తమ అనుయాయుల వద్ద చెపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో జనసేన నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే లోకం నాగమాధవి పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. జనసేన కోటాలో ఆమెకు విజయనగరం జిల్లా నుంచి తప్పనిసరిగా మంత్రి పదవి ఇస్తారని ప్రచారం జోరందుకుంది.

రాష్ట్రంలో కూటమి విజయం సాధించడంతో ఈ నెల 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాణ స్వీకారం రోజునే కేబినెట్ మినిస్టర్లు కూడా ప్రమాణం చేయనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా ఎవరిని మంత్రి పదవి వస్తుందోనని గత వారం రోజులుగా చర్చ జరుగుతోంది. కూటమిలో మిత్రపక్షంగా ఉన్న జనసేనకు ఎన్ని మంత్రి పదవులు వస్తాయన్న దానిపైనా చర్చ జరుగుతోంది. కాగా సమయం దగ్గర పడటంతో జనసేనకు కనీసం నాలుగు నుంచి ఐదు, బిజెపికి ఒకటి మిగతా పదవులు టిడిపి నాయకులకు ఇస్తారని ప్రచారం జోరందుకుంది. దీన్ని బలపరుస్తూ సోమవారం ఢిల్లీలో పవన్ కల్యాణ్, చంద్రబాబు కలిసి మంత్రి పదవులపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా పవన్‌ను కేబినెట్‌లోకి రావాలని చంద్రబాబు ఆహ్వానించినట్లు, దానికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో జనసేనకు వచ్చే ఐదులో ఒకటి దాదాపు ఖరారు కాగా మిగిలిన నాలుగు ఎవరికి ఇస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పోటి చేసి గెలిచిన 21 మంది


లోకం నాగమాధవి

ఎమ్మెల్యేల్లో ఒకే ఒక మహిళా నాయకులు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఉన్నారు. జనసేనకు కేటాయించిన పదవుల్లో మహిళగా గౌరవించి ఆమెకు తప్పనిసరిగా ఆ కోటాలో మంత్రి పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆమెను విజయవాడకు పార్టీ ఆహ్వానించినట్లు తెలిసింది. దీంతో ఆమె సోమవారం హడావుడిగా విజయవాడకు బయలుదేరారు.

ఆమెకు కచ్చితంగా మంత్రి పదవి వస్తుందని జనసైనికులు కూడా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఆ పార్టీ నుంచి లోకం నాగమాధవి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్లు జనసేన అధిష్టానం పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అదే జరిగితే పోటి చేసి విజయం సాధించిన తొలిసారే మంత్రి పదవి దక్కించుకున్న మహిళా ఎమ్మెల్యేగా గుర్తింపు తెచ్చుకునే అవకాశముంది. అంతేకాకుండా జిల్లాల పునర్విభజన తరువాత విజయనగరం జిల్లాకు తొలి మహిళా మంత్రిగా రికార్డు నెలకొల్పే అవకాశం ఉందని పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.


బుక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

విద్యా కానుక స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో పాఠశాలలకు అందజేయాల్సిన విద్యా కానుక స్టాక్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ ప్రేమ్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో మండల విద్యాశాఖాధికారి పి.బాలభాస్కరరావు, సిఆర్ఎంటిలు, ఎంఆర్‌సిలు, సిబ్బంది, పిఐటిలు, పిటిఐలు పాల్గొన్నారు.


నరసింహారావును సత్కరిస్తున్న జెసి రాజు తదితరులు

బ్లడ్‌బ్యాంక్ చైర్మన్ బుద్దలకు సత్కారం

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి బ్లడ్ బ్యాంక్ చైర్మన్ బుద్దల నరసింహారావును బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్సులు జెసి రాజు, శ్రీహరి సోమవారం బొబ్బిలి బ్లడ్ బ్యాంక్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతు బొబ్బిలిలో బ్లడ్ బ్యాంక్ లేనప్పుడు రక్తం అందుబాటులో లేకతీవ్రమైన ఇబ్బందులు పడేవారమని, అలాంటి సమయంలో బ్లడ్ బ్యాంక్ పెట్టి అనేక మందికి ప్రాణం పోస్తున్నారని గుర్తు చేశారు. ప్లాస్మా, ప్లేటిలేట్స్ అవసరమైన వారికి అందిస్తూ అనేక మందిని మరణ ప్రమాదం నుండి కాపాడుతున్నారని కొనియాడారు. సమాజానికి సేవలు అందించేవారని రోటరీ గుర్తిస్తుందని ఆయన తెలియజేశారు. మరి కొన్ని బ్లడ్ బ్యాంక్స్‌ను నెలకొల్పి ప్రజలకు సేవాలందించాలని కోరారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మేనేజర్ ఈశ్వరరావు, సంజీవిని బ్లడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, పైడి తల్లి తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సోమవారం రామోజీరావు సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు. రామోజీరావు చిత్రపటానికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి, బొబ్బిలి తాలూక అద్యక్షులు కర్రి సత్యనారాయణ, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామోజీరావు వ్యాపార రంగంలో బాగా రాణించి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా ముసుగు తొలగించరా?

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ఎన్నికల నేపథ్యంలో అధికారులు ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ నాయకులకు వేసిన ముసుగులు తొలగించకపోవడం పట్ల గ్రామాలలో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాయకులకు వేసిన ముసుగులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.


ముసుగుతో ఉన్న విగ్రహాలు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే బేబినాయనను లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ కోరారు. తమ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుంచి నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బేబినాయన పని చేయాలన్నారు. గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలని, రోడ్ల విస్తరణ పనులు చేయాలని, సాగునీరు, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. పట్టణ, గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆయనతో సమాచార హక్కు చట్టం సభ్యులు సురేష్ ఉన్నారు.



కూరగాయలను అమ్ముతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కూరగాయల స్టాల్స్ ఏర్పాటు

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన కూరగాయలు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. యూనిట్ ఇంచార్జి గుడివాడ సింహాచలం ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది కార్యదర్శులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఇలా పండించిన కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యాలు బాగుంటాయని వివరించారు. అనంతరం కూరగయాలను విక్రయించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తుమ్మగంటి సుశీల, సిగ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు విముక్తి కల్పించండి

ప్రజాశక్తి- గజపతినగరం

ఆగూరు పంచాయతీకి సంబంధించిన కొంతమంది గిరిజన రైతులకు అక్రమ రుణదారుల నుంచి విముక్తి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రాకోటి రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గజపతినగరం డిసిసిబి మేనేజర్‌కు ఆయన ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘంవలస, కింద గూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతులు రిజర్వుడ్ ఫారెస్ట్ భూములను తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. మెంటాడ మండలానికి చెందిన న్యాయవాది బండారు సంజీవరావు కుటుంబ సభ్యులు ఒకప్పటి తహశీల్దార్ దూసి రవి సహాయంతో నకిలీ పత్రాలు సృష్టించి డిసిసిబి బ్యాంకు నుంచి రూ.15 లక్షలు రుణం తీసుకున్నారని ఆరోపించారు. దయచేసి భూమి వద్దకు వచ్చి తనిఖీ చేసి తమకు న్యాయం చేయాలని గిరిజన రైతులు కోరారు.


వినతి పత్రాన్ని అందిస్తున్న గిరిజనులు, రాకోటి రాములు

'జిందాల్' మరో పోస్టర్ విడుదల

ప్రజాశక్తి- కొత్తవలస

జిందాల్ యాజమాన్యం ఎంప్లాయిస్ కార్మికులకు లే ఆఫ్ ఇస్తున్నామని, కాంట్రాక్ట్ కార్మికులకు మే నెలకు లే ఆఫ్ ఇస్తున్నామని గోడ పత్రిక ద్వారా సోమవారం ప్రకటించింది. ఈ పత్రిక ఆధారంగా ఎంప్లాయిస్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు విధిగా పాటించాలని తెలియజేసింది. కంపెనీలో ముడి సరుకు కొరత ఏర్పడినప్పటికీ 2023 అక్టోబర్ నుంచి 2024 మే 16 వరకు కంపెనీని ఓడి అనేక ఒడిదుడుకులతో నడిపామని కంపెనీ హెచ్ఆర్ డిజిఎం జె. గోపాలకృష్ణ గోడపత్రికలో పేర్కొన్నారు. చేసేది లేక 2024 మే 17 నుంచి లే ఆఫ్ ప్రకటించామని తెలిపారు. అయినప్పటికీ కార్మికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మే నెలకు భేషరతుగా లే ఆఫ్ ఇస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా కాంట్రాక్ట్ కార్మికులు, ఎంప్లాయిస్ ఒరిస్సా రాష్ట్రంలోని జాజిపూర్ గల జిందాల్ యూనిట్ కు వెళ్లాల్సిందిగా కోరారు. ప్రస్తుతం ఇక్కడ కంపెనీ పరిస్థితి బాగోలేదని, ఇప్పటిలో తెరిచే అవకాశం లేదని, కాబట్టి కార్మికులు జాజిపూర్ వెళ్లాల్సిందిగా తెలియజేశారు. ఫ్యాక్టరీ ఎదుట లేనిపోని విధంగాఆందోళన కార్యక్రమాలు చేయడం శ్రేయస్కారం కాదని, తక్షణమే మీ విధుల్లోకి చేరి యాజమాన్యానికి సహకరించాలని కోరారు. కాగా సోమవారం కార్మికులు చేస్తున్న సమ్మె 25వ రోజుకు చేరుకుంది.

పిఎసిఎస్ చైర్మన్ పదవికి రాజీనామా

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పూసపాటిరేగ పిఎసిఎస్ చైర్మన్ మహంతి లక్ష్మణరావు సోమవారం రాజీనామా చేశారు. రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయన రాజీనామా పత్రాన్ని స్థానిక పిఎసిఎస్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పిఎసిఎస్ చైర్మన్‌గా పదవి ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు రుణపడి ఉంటానన్నారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవిని బాధ్యతాయుతంగా నిర్వహించానని చెప్పారు. తాను ఎప్పుడూ బొడ్డుకొండతోనే ఉంటానని, వైసిపి బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఆయనతో పాటు బోర్డు సభ్యులు నారాయణ మూర్తి రాజు రాజీనామా చేశారు. వారితో పాటు స్థానిక సర్పంచ్ తొంపల సీతారాం తదితరులు ఉన్నారు.


రాజీనామా పత్రాన్ని అందిస్తున్న లక్ష్మణరావు

చేజారిన చేయూత?

- 30 శాతం మహిళలకు మాత్రమే అందిన డబ్బులు
- రేపు సిఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిల్లాలో ఇంకా కొంత మంది మహిళల ఖాతాల్లో చేయూత రూ.18,750లు జమకాకపోవడంతో చేజారినట్లేనని మహిళలు గుసగుసలాడుకుంటున్నారు. ఈ ఏడాది వైఎస్ఆర్ చేయూత పథకానికి సంబంధించి వైసిపి ప్రభుత్వం నాలుగవ విడతలో భాగంగా రూ.5,060 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ రూ.2,113 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఇంకా రూ.2,947 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. దీంతో కొద్దిమంది మహిళల ఖాతాల్లో మాత్రమే నగదు జమ కావడంతో ఇంకా తమ ఖాతాల్లో నగదు జమ కాని మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఈ పథకం నిధులు పూర్తిగా జమ కాకుండా ఉంటే పరవాలేదని కొంతమంది మహిళలకు వారి ఖాతాల్లో డబ్బులు జమై మిగిలిన వారికి కాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళ సాధికారిక పేరుతో గత వైసిపి ప్రభుత్వం 45 సంవత్సరాల నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకు అందించిన చేయూత 4వ విడత డబ్బులు 30శాతం మంది మహిళల ఖాతాల్లో మాత్రమే జమయ్యాయి. ఎన్నికలకు నెల రోజులు ముందుగా జగన్మోహన్ రెడ్డి చేయూతకు సంబంధించి బటన్ నొక్కినప్పటికీ ఎన్నికల దగ్గర్లో మహిళల ఖాతాలో డబ్బులు వేయవచ్చునని ధీమా వ్యక్తం చేశారు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో చాలా మందికి డబ్బులు అందలేదు. మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తుందని తరువాతైనా తమ డబ్బులు తమ ఖాతాల్లో వేస్తారని చాలా మంది మహిళలు ఆశపడినా వైసిపి ఓటమి చెందడంతో నిరాశ చెందారు. బుధవారం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో చేయూత డబ్బులు విడుదల కానట్లేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దీంతో మహిళలు ఉన్నకాడికి ఆశలు వదిలేసుకున్నారు.



నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రయివేటు విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో 1 ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేసేలా చూడాలని, 25శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించి ఉచితంగా చదివించాలని కోరారు.

విద్యార్థులు సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, బాత్ రూములు ఏర్పాటు చేయాలని, అధిక ధరలకు పుస్తకాలు అమ్మకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సెంచూరియన్‌లో సౌకర్యాలు భేష్

పిఎఫ్ మాజీ కమిషనర్ రాజు, బిహెచ్‌పివి మాజీ జనరల్ మేనేజర్ వర్మ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విశాఖకు చెందిన ప్రావిడెంట్ ఫండ్ మాజీ కమిషనర్ ఎస్వీఎస్ రామచంద్రరాజు, బిహెచ్ పివి మాజీ జనరల్ మేనేజర్ డి.ఎస్.వర్మ సోమవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. సెంచూరియన్‌లో గల అత్యాధునిక ల్యాబ్‌లు, పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు వారికి సెంచూరియన్ విశ్వవిద్యాలయం ప్రత్యేకతల గురించి వివరించారు. ఇక్కడ తక్కువ ఎత్తులో ఎగిరే జైరోప్లేన్ విమానం తయారుచేస్తొన్నామన్నారు. 1000 ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాల తయారు చేశామ న్నారు. అనంతరం కంప్యూటర్ న్యూమరికల్ యూని ట్‌లో చంద్రయాన్-2 విడిపరికరాల తయారీ, 3డి ప్రింటర్ టెక్నాలజీ, సిమ్యులేటర్, ఫోరెన్సిక్ ల్యాబ్, ఆప్టొమెట్రీ ల్యాబ్, ఆగ్యుమెంటెడ్ రియాల్టీ, వర్చువల్ రియాల్టీ ల్యాబ్, టిష్యూ కల్చర్ ల్యాబ్, కుట్టు యంత్రాల యూనిట్, క్రీడా మైదానం తదితర వాటిని తిలకించారు. ఇక్కడ సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని వారు కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణా రావు, డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ దీపక్, డాక్టర్ సూర్యతేజ, డాక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.


ఆప్టొమెట్రీ గురించి వివరిస్తొన్న డాక్టర్ శ్రావణి

విధి నిర్వహణపై అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

ప్రజాశక్తి- రేగిడి

గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమకు కేటాయించిన సచివాలయాలలో విధి నిర్వహణపై అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎంపిడిఒ శ్యామల కుమారి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 25 గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు సమయాలు పాటించి, ప్రజలకు జవాబిదారితనంగా ఉండాలన్నారు. సచివాలయల నిర్వహణ బాధ్యతలు పంచాయతీ కార్యదర్శిలదేనని తెలిపారు. ఎప్పటికప్పుడు సమాచారం మండలకేంద్రానికి పంపించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సమయాలకు సచివాలయాలకు రాకుంటే ఎలా అని ప్రశ్నించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి ఏవి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీ చరణ్ పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ నిశ్చల సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై కార్యదర్శులు దృష్టి పెట్టాలన్నారు. రానున్నది వర్షాకాలం కాబట్టి ముందస్తు చర్యలో భాగంగా కాలువుల్లో పూడికలు తొలగించాలన్నారు. ఇఒపిఆర్‌డి ఉమా మాట్లాడుతూ గత సమావేశంలో కూడా పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని చెప్పినప్పటికీ ఇంకా కొన్ని పంచాయతీల నుంచి తమకు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.


రేగిడి: మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్యామల కుమారి

ఖరీఫ్ విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి - జామి

ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి మండలానికి వరి విత్తనాలు సిద్ధం చేసినట్లు వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలానికి గానూ 2,365 క్వింటాలు విత్తనాలు వచ్చాయన్నారు. ముఖ్యంగా ఎంటియు 1121(శ్రీ ధృతి)1925 క్వింటాలు, బిపిటి 3,291 (సోనామసూరి) 160 క్వింటాలు, 5204(సాంబమసూరి) 60 క్వింటాలు, 1224(మార్టేరు సాంబ)150 క్వింటాలు, 1318 రకం (స్వర్ణ రకంకి ప్రత్యామ్నాయం) 50 క్వింటాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో ముందుగా 90శాతం మనకు కావలసిన 1121 రకం 15 రోజులు ముందుగానే తెప్పించి అన్ని రైతు భరోసా కేంద్రాలలో ఉంచామన్నారు.

నేటి నుంచి పంపిణీ

మండలంలో 10 రైతు భరోసా కేంద్రాలలో మంగళవారం నుంచి విత్తనాలను పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. రైతులు ఆధార్ కార్డుతో వచ్చి వేలు ముద్ర వేసి విత్తనం తీసుకోవాలని ఆయన కోరారు. 1121 రకం వ్తినాలు రూ.894, సోనామసూరి రూ.834, సాంబమసూరి రూ.795, 1318 రకం రూ.894, మార్టేరు సాంబ రూ.795 చెల్లించి తీసుకోవాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్ష


ప్రజాశక్తి- బొబ్బిలి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పిఎం అవార్డు సభ్యులు వైఆర్ సింగ్, ఎన్.కె వాధ్వ సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలో ఐటిఐ కాలనీ జగనన్న లేఅవుట్‌లో పిఎం ఆవాస్ యోజన ఇళ్లను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లతో ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు పొంది రూ.300 సబ్సిడీతో గ్యాస్ పొందుతున్నామని లబ్ధిదారులు అవార్డు టీమ్ సభ్యులకు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రుణాలతో చేపలు పెంచుతున్నామని మత్స్యకారులు, పాడి పశువులు కొనుగోలు చేసి పాల ఉత్పత్తిలో ఉపాధి పొందుతున్నామని పాడి రైతులు, రుణాలతో భూమిను అభివృద్ధి చేసి వ్యవసాయ పెట్టుబడులు పెట్టడంతో ప్రైవేట్ రుణాలు వాడాల్సిన అవసరం రాలేదని రైతులు చెప్పారు. పిఎం స్వనిది యోజన పథకంతో రుణాలు తీసుకుని స్వయం ఉపాధి పొందుతున్నామని మహిళలు చెప్పారు. వడ్డీ లేకుండా రుణాలు ఇస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని రైతులు, వృత్తిదారులు కమిటీ సభ్యులను కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

ప్రధానమంత్రి యోజన పథకాలు పరిశీలన

బొబ్బిలిరూరల్: మండలంలో జి.యెస్.ఆర్‌పురంలో పలు ప్రధానమంత్రి యోజన పథకాలను సోమవారం కేంద్ర బృందం డైరెక్టర్లు వైఎస్‌సింగ్, ఎన్.కె వాద్వ, పియం మాతృయోజన, పియం ఆరోగ్య, పియం మెషిన్, పియం ఇంద్ర ధనస్సు, పోషన్ ఆదయాన్ తదితర పథకాలపై ఆయా పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ, ఆర్.డబ్ల్యుఎస్ ఎస్ఇ, తహశీల్దార్, ఐసిడిఎస్ పిఒ పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు


నాగార్జునను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

కిమిడి నాగార్జునకు సత్కారం

ప్రజాశక్తి -చీపురుపల్లి

జిల్లాలోని అన్ని ఎమ్మెల్యే, ఎంపి స్థానాల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులు గెలిచినందుకు విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జునని స్థానిక టిడిపి నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. చీపురుపల్లిలోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో జిల్లాలో విస్తృతంగా పర్యటించి, ప్రచారం చేసి ఎన్‌డిఎ అభ్యర్థుల గెలుపునకు నాగార్జున ఎనలేని కృషి చేసారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు నారాయణరావు, మీసాల కాశి, సప్ప సూరప్పుడు, కోటేశ్వరరావు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న ఎడ్ల బండ్లు

ఉత్సాహంగా ఎడ్లపరుగు ప్రదర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేటలో సోమవారం గ్రామ దేవత శ్రీ పరదేశమ్మ తల్లి పండగ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా జరిగింది. ఈ పరుగు ప్రదర్శనలో 16 ఎడ్ల బళ్ళు పాల్గొని తలబడ్డాయి. ఈ పోటీల్లో గెలిపొందిన మొదటి విజేతకు రూ. 12వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.8వేలు నగదు అందించారు. విజేతలకు మాజీ డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామునాయుడు, బక్కు నాయుడుపేట పెద్దలు, కమిటీ సభ్యులు అందించారు.